క్లుప్తంగా

సన్మానం

కలసపాడు : స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఆంగ్ల ఉపాధ్యాయురాలు రబ్బానిని ప్రధానోపాధ్యాయురాలు కవితతో పాటు ఉపాధ్యాయులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కలసపాడులో పర్యటించి విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి చదువు విషయంపై విద్యార్థులను ఆరా తీయగా 9వ తరగతి విద్యార్థి ఇంగ్లిష్‌లో అనర్గళంగా మాట్లాడటంతో అక్కడి నుంచి ఆంగ్ల ఉపాధ్యాయురాలు రబ్బానితో ప్రిన్సిపల్ సెక్రటరీ ఫోన్‌లో మాట్లాడి అభినందించారు.

నోటు పుస్తకాల పంపిణీ

బద్వేలు అర్బన్ : పోరుమామిళ్లలోని ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, తోమాస్‌రెడ్డిల ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ఆర్సీఎం ఉన్నత పాఠశాల, బాలాయపల్లె ఆర్సీఎం ప్రాథమిక పాఠశాల, నందిపల్లె సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలలలో చదువుతున్న 485 మంది విద్యార్థులకు ఉచితంగా నోటుపుస్తకాలు పంపిణీ చేశారు.

నేడు ఎమ్మెల్యే రాక

బ్రహ్మంగారిమఠం : మండలంలోని ముడుమాల, పలుగురాళ్లపల్లె పంచాయతీలో మంగళవారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి పర్యటన ఉంటుందని ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా ముడుమాల గ్రామ సచివాలయంలో జరిగే జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని అనంతరం పలుగురాళ్లపల్లెలో వాటర్‌షెడ్ పనులను పరిశీలిస్తారన్నారు.

టైలరింగ్ సెంటర్ ప్రారంభం

పోరుమామిళ్ల : పట్టణంలో ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, చిత్తా థామస్‌రెడ్డి ఏర్పాటు చేసిన చిత్తా లూర్దుమర్రెడ్డి టైలరింగ్ సెంటర్‌ను సోమవారం సాయంత్రం రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి ప్రారంభించారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గిరిప్రణీత్ రెడ్డి, ప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

సర్వే తనిఖీ చేసిన అడిషనల్ డీఎంహెచ్‌ఓ

బ్రహ్మంగారిమఠం : కుష్టువ్యాధి నిర్మూలనపై మండలంలో ఆశావర్కర్లు, వైద్యసిబ్బంది నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను సోమవారం అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో బి.మఠం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ మల్లేష్, హెల్త్‌అసిస్టెంట్ మాధవనాయుడు పాల్గొన్నారు.

రాంగోపాల్‌కు ఉత్తమ ఆచార్య పురస్కారం

ప్రొద్దుటూరు : పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు కేఆర్ రాంగోపాల్ రాష్ట్ర స్థాయి ఉత్తమ ఆచార్య పురస్కారం అందుకున్నారు. ఈయన ఎర్రగుంట్ల జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. వ్యాస మహర్షి గురుపూజోత్సవం సందర్భంగా హిందూ ఉపాధ్యాయ సమితి ఆధ్వర్యంలో తిరుపతి శ్రీచైతన్య హైస్కూల్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పురస్కారం అందుకున్నారు. కార్యక్రమంలో కమలానంద భారతి స్వామి, హిందూ ఉపాధ్యాయ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మహేష్ డేగల తదితరులు పాల్గొన్నారు.

రేకలకుంట సర్వేయర్‌పై గ్రామస్తుల ఫిర్యాదు

బ్రహ్మంగారిమఠం: రేకలకుంట 1 గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న సర్వేయర్ పవన్ విధులకు సరిగా హాజరు కావడంలేదని స్థానికులు ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డికి ఫిర్యాదు చేశారు. సోమవారం జగనగన్న సురక్ష కార్యక్రమంలో ఈ మేరకు ప్రజలు ఆయనతో మాట్లాడుతూ డబ్బులు ఇవ్వంది పని చేయడం లేదని ఆరోపించారు. సర్వేయర్‌పై ఉన్నతాధికారులకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని డిప్యూటీ తహసీల్దార్ జాన్సన్, ఎంపీడీఓ వెంగమునిరెడ్డిలకు ఎంపీపీ సూచించారు.

కుష్టు రహిత సమాజం ఏర్పడాలి

మైదుకూరు : కుష్టువ్యాధి రహిత సమాజం ఏర్పడేందుకు అందరూ కృషి చేయాలని అదనపు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలీ అన్నారు. సోమవారం మైదుకూరు మండలం జీవీ సత్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నంద్యాలంపేటలో కుష్టు వ్యాధిపై నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను ఆయన పరిశీలించారు. కుష్టు వ్యాధి లేని సమాజం కోసం ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం జీవీ సత్రంలోని పీహెచ్‌సీని పరిశీలించారు. వైద్యాధికారి శ్రీనాథ్, ఎంపీఈఓ వెంకటరమణ, సూపర్‌వైజర్లు రజియా సుల్తానా, జనార్దన్ పాల్గొన్నారు. వనిపెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అదనపు డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ పరిశీలించారు. వైద్యాధికారి తస్లీమ్ ఫాతిమా, సీహెచ్‌ఓ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

రక్తదానంలో ముందుండాలి

బద్వేలు అర్బన్ : ఆపద సమయంలో సాటి మనిషి ప్రాణాలను కాపాడేందుకు అవసరమైన రక్తదానంలో యువతీయువకులు ముందుండాలని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్ రెడ్డి, అడా చైర్మన్ సింగసాని గురుమోహన్‌లు పేర్కొన్నారు. సోమవారం గురుపౌర్ణమి సందర్భంగా దత్తసాయిబాబా సేవాసమితి ఆధ్వర్యంలో సాయిబాబా ఆలయ ఆవరణలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన వచ్చింది. ఎస్.శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 203 మంది రక్తదానం చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఆర్.వి.సాయిక్రిష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు


మైదుకూరు: ప్రత్యేక అలంకరణలో సాయిబాబా


దొరసానిపల్లెలో..


కలసపాడు: పూజల్లో పాల్గొన్న మహిళలు


బాబా ఆలయంలో పూజలు చేస్తున్న జడ్జి హారిక

ప్రొద్దుటూరు కల్చరల్ : గురుపౌర్ణమి పురస్కరించుకుని సోమవారం పట్టణంలోని పలు సాయిబాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి ఆలయాల్లో బాబాను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. స్థానిక వసంతపేటలోని సాయిబాబా ఆలయంలో పంచామృతాభిషేకం నిర్వహించి నూతన పట్టువస్త్రాలు, గజమాలలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సెట్టింగ్ అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వైఎంఆర్ కాలనీలోని సాయిబాబా ఆలయంలో బాబాను సుందరంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని కాయకర్పూరాలను నైవేద్యంగా సమర్పించి పూజించారు. అలాగే దొరసానిపల్లెలోని సాయిబాబా ఆలయంలో బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. స్థానిక శివాలయం వీధిలోని యోగిరాజ వల్లభ దత్తాత్రేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జై గురుదత్త శ్రీ పాదవల్లభ సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాద వినియోగం జరిగింది. వాసవీ సర్కిల్‌లోని సాయిబాబా ఆలయంలో బాబాకు ఒకటవ అదనపు మెజిస్ట్రేట్ ఆర్.హారిక పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ సగబాల నాగరాజు ఆమెకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మైదుకూరు: మైదుకూరులో సోమవారం గురుపూజోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక వనిపెంట రోడ్డులోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో, బ్రహ్మంగారు గోవిందమాంబ మూలవిరాట్లకు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం బ్రహ్మంగారి చిత్రపటాన్ని పట్టణంలో ఊరేగించారు. కడప రోడ్డులోని కొత్త సాయిబాబా గుడి, సాయినాథపురంలోని సాయినాథ ఆలయంలో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మూలవిరాట్లకు ప్రత్యేక అలంకరణలు, పూజలు చేసి అన్నప్రసాద వినియోగం చేశారు.

గురువులను ఆదరించినపుడే భవిష్యత్తు

పోరుమామిళ్ల : సమాజంలో గురువులను ఆదరించి గౌరవించినపుడే ఉన్నత భవిష్యత్తు ఉంటుందని ఆధ్యాత్మిక రచయిత, జాతీయ అవార్డు గ్రహీత కృష్ణనాయక్ తెలిపారు. వ్యాస పౌర్ణమి సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ విద్యా పరిమళాలు వెదజల్లుతూ, జ్ఞానజ్యోతిని వెలిగించి వ్యక్తులను సన్మార్గంలో నడిపేవాడే గురువు అన్నారు. శ్రీరాముడు, శ్రీకృష్ణులకు విద్య నేర్పింది గురువే అన్నారు. గురువు ద్వారా నేర్చుకున్న విద్యకు సార్థకత ఉంటుందన్నారు. నేటి విద్యార్థులు గురువుల పట్ల వినయ విధేయతలు, భక్తిభావం కలిగి ఉండాలన్నారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

అట్లూరు : గురుపౌర్ణమి సందర్భంగా మండల పరిధిలోని పలు ఆలయాలలో పూజలు నిర్వహించారు. ముఖ్యంగా కొండూరు బీసీ కాలనీలో వెలసిన సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకుడు నరసింహరాజు తీర్థప్రసాదాలు అందించారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మాడపూరులో ఉన్న మాధవరాయస్వామి ఆలయం ప్రాంగణంలో అన్నదాన చేశారు.

కలసపాడు : స్థానిక అమ్మవారిశాలలోని శ్రీకృష్ణ మందిరంలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలను ఆర్యవైశ్యులు ఘనంగా నిర్వహించారు. భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

కాశినాయన : మండల ప్రజలు సోమవారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. జ్యోతిక్షేత్రంలో గురుపౌర్ణమిని పురస్కరించుకుని గత వారం రోజుల నుంచి నిరాటంకంగా భజన చేస్తున్నారు. ఉత్సవ విగ్రహానికి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ వారు అన్నదానం ఏర్పాటు చేశారు.

బద్వేలు అర్బన్ : పట్టణంలోని తెలుగుగంగ కాలనీ సమీపంలో ఉన్న దత్త సాయిబాబా ఆలయంలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

రూ.2.87 కోట్ల పంటల బీమా మంజూరు

కాశినాయన : మండలంలోని 1406 మంది రైతులకు రూ.2.87 కోట్లు బీమా మంజూరైందని మండల వ్యవసాయాధికారి జాకీర్ షరీఫ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022 సంవత్సరంలో వరి, ఉల్లి, కంది, బత్తాయి, పత్తి పంటలు వేసి నష్టపోయిన రైతులకు నష్టపరిహారాన్ని ప్రభుత్వం వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసిందన్నారు. రైతులు తప్పనిసరిగా ఈ–క్రాప్ చేసుకోవాలని కోరారు. లేకుంటే నష్టపరిహారం మంజూరు కాదని తెలిపారు.

ఖాజీపేట ఎస్‌ఐగా రాజరాజేశ్వరరెడ్డి

ఖాజీపేట : ఖాజీపేట నూతన ఎస్‌ఐగా రాజరాజేశ్వరరెడ్డి సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ ఎస్‌ఐగా పనిచేస్తున్న కుళ్లాయప్ప బదిలీ కావడంతో రాజరాజేశ్వరరెడ్డి నియమితులయ్యారు.

20 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ

ప్రొద్దుటూరు : పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా ఒకటో వార్డు పరిధిలోని అర్హులైన పేదలకు సోమవారం ఇళ్ల పట్టాల పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ గోనా ప్రభాకర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెంపుడు కుక్క కనిపించలేదని ఫిర్యాదు

ప్రొద్దుటూరు క్రైం : పెంపుడు కుక్క కనిపించలేదని ఓ మహిళ త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బుడ్డాయపల్లెకు చెందిన ప్రజ్వల అనే మహిళ మూడు కుక్కలను పెంచుకుంటోంది. వాటిలో ఒక కుక్క కనిపించక పోవడంతో ఆదివారం ఆమె త్రీ టౌన్ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు త్రీ టౌన్ సీఐ నారాయణయాదవ్ తెలిపారు.

విద్యార్థుల భద్రత పట్ల జాగ్రత్తగా ఉండాలి

మైదుకూరు : గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల భద్రత పట్ల పాఠశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు జాగ్రత్త వహించాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు లక్ష్మీదేవి అన్నారు. సోమవారం మైదుకూరు బీసీ బాలికల గురుకుల పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. విద్యార్థులకు ప్రభుత్వం నుంచి అందుతున్న జగనన్న విద్యాకానుక కిట్లు అందాయా లేదా అని ఆరా తీశారు. విద్యార్థినులకు శానిటరీ న్యాప్ కిన్స్ అందిస్తున్నారా లేదా, మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వసంతను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవి మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నో సౌకర్యాలు కల్పిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు బాగా చదువుకోవాలని అన్నారు. కార్యక్రమంలో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ జిల్లా ప్రతినిధి సునీత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ప్రశాంతి, నజీరా తదితరులు పాల్గొన్నారు.


జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న లక్ష్మీదేవి

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

మైదుకూరులోని 6వ అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం బాలల హక్కుల పరిక్షణ కమిషన్ సభ్యురాలు లక్ష్మీదేవి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలువురు గర్భిణులు, బాలింతలతో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు సీడీపీఓ శ్రీదేవి, సూపర్‌వైజర్లు ప్రశాంతి, వరలక్ష్మి పాల్గొన్నారు.

రైతుల ప్రయోజనాల కోసం ఆర్బీకేలు

పోరుమామిళ్ల : రైతుల సమగ్రాభివృద్ధి, రైతుల ప్రయోజనాల కోసం ముఖ్యమంత్రి ప్రతి పంచాయతీలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని టేకూరుపేట, తిమ్మారెడ్డిపల్లె పంచాయతీల్లో రైతు భరోసా కేంద్రాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు సంబంధించిన ప్రతి సమస్యకు ఈ ఆర్బీకేల్లో పరిష్కారం లభిస్తుందన్నారు. రైతులకు కావాల్సిన వ్యవసాయ పనిముట్లు, ఎరువులు, విత్తనాలు ఇక్కడే లభిస్తాయన్నారు.

తారు రోడ్డు పనులకు భూమిపూజ

కలసపాడు : మండలంలోని ఎగువ రామాపురంలో సోమవారం పీఆర్ నిధులతో నిర్మించనున్న తారు రోడ్డు పనులకు ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు భూమిపూజ చేశారు. తంబళ్లపల్లె నుంచి రామాపురం మీదుగా సుగాలితాండ వరకు సుమారు 8 కిలోమీటర్ల రోడ్డును రూ.6.80 కోట్లతో తారు రోడ్డు నిర్మించనున్నారు. కార్యక్రమంలో పీఆర్‌ఆర్డీ ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అంకన గురివిరెడ్డి, సూదా రామకృష్ణారెడ్డి, నారాయణయాదవ్, సుదర్శన్, పురుషోత్తంరెడ్డి, సర్పంచ్ వెంకటయ్య, చిత్తా రాజశేఖర్‌రెడ్డి, పీఆర్ ఈఈ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


కలసపాడు: రోడ్డు పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్ ప్రారంభం

రామాపురంలో రూ.17.50 లక్షలతో నూతనంగా నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను సోమవారం ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు ప్రారంభించారు. గ్రామస్తులు, నాయకులు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలకు ఘన స్వాగతం పలికారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు

ప్రొద్దుటూరు : దొరసానిపల్లె గ్రామం సాయినగర్‌లో గురుపౌర్ణమి సందర్భంగా సోమవారం ఒంటెద్దు బండలాగుడు పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. పోటీలను మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి ప్రారంభించారు. పోటీలను తిలకించేందుకు పెద్ద ఎత్తున ప్రజలు వచ్చారు. పోటీల్లో గెలుపొందిన ఒంటెద్దు బండి యజమానులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు కృష్ణారెడ్డి, నరసింహులు, భాస్కర్, శంకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇది రైతుల ప్రభుత్వం

ఖాజీపేట : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతు ప్రభుత్వమని, అందుకే రైతులందరికి ఆయన ఎంతో మేలు చేస్తున్నారని రాష్ట్ర ఉద్యాన వన ప్రభుత్వ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి అన్నారు. ఖాజీపేట మండలం పుల్లూరు పంచాయతీలోని రైతు భరోసా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 8వ తేదిన రైతు దినోత్సవం రోజున రైతులకు పంటల బీమా మొత్తం రైతుల ఖాతాలకు ప్రభుత్వం జమ చేస్తుందని అన్నారు. గతంలో పంట పరిహారం, బీమా పరిహారం ఎప్పుడు వస్తుందో రైతులకు తెలిసేది కాదన్నారు. నేడు సీజన్‌లోపు పరిహారం వస్తోందని తెలిపారు. ఏడీఏ సుబ్బారావు, ఏఓ నాగార్జునా, ఆంజనేయకొట్టాలు సర్పంచ్ పెద్దిరెడ్డి, స్థానిక రైతులు పాల్గొన్నారు.

బోధనపై అవగాహన అవసరం

చాపాడు: ప్రభుత్వ పాఠశాలలో పని చేసే ప్రతి ఉపాధ్యాయుడు డిజిటల్ విద్యా బోధనపై అవగాహన పెంపొందించుకోవాలని మండల విద్యాధికారి రవిశంకర్ పేర్కొన్నారు. స్థానిక సీబీఐటీ ఇంజనీరింగ్ కాలేజీలో సోమవారం ఇంటరాక్టివ్ ఫ్లాట్ ఫ్యానెల్‌పై డిజిటల్ విద్యా బోధన చేసే విధానంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. చాపాడు, ప్రొద్దుటూరు, మైదుకూరు, జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం, ముద్దనూరు, ఎర్రగుంట్ల, కొండాపురం మండలాలకు చెందిన ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు చెందిన 410 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సీబీఐటీకి చెందిన శిక్షకులు కృపాసాగర్, సుబ్బారెడ్డిలు శిక్షణ ఇచ్చారు.

వ్యాపారుల స్వేచ్ఛకు పూర్తి సహకారం

ప్రొద్దుటూరు : పట్టణంలో వ్యాపారుల స్వేచ్ఛకు ఎన్నడూ భంగం కలిగించనని, వారికి పూర్తి సహకారాన్ని అందిస్తూ నియోజకవర్గంలో శాంతియుత వాతావరణానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. స్థానిక పాతమార్కెట్‌లోని ఆంజనేయస్వామి ఆలయ కమిటీ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడిగా సత్యనారాయణ జ్యువెలర్స్ అధినేత కేవీఎస్ సత్యనారాయణ, సభ్యులుగా సుంకు కిశోర్‌బాబు, పీవీ జగదీష్, బి.సంగీత, కె.నాగరత్నమ్మ, కె.మాబున్ని ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ హింస ఉంటే అభివృద్ధి ఉండదనే సత్యాన్ని తాను గమనించానన్నారు. రౌడీయిజం, అల్లరిమూకలు, రాజకీయ హత్యలు, కక్షలు, వ్యాపారులను ఇబ్బంది పెట్టకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. స్వేచ్ఛగా వ్యాపారం చేసుకునేందుకు తాను తోడ్పాటు అందిస్తున్నానన్నారు. టీడీపీ నేతలు ఉద్దేశ పూర్వకంగా తనపై విమర్శలు చేసి బజారుకు ఈడ్చారని అన్నారు. మట్కా, గుడ్కా, క్రికెట్ బెట్టింగ్, భూముల ఆక్రమణ, ఇసుక అక్రమ రవాణా ఇలా అన్నింటిలో తన పాత్ర ఉందని పదే పదే విమర్శలు చేయడంతో తాను ఏకంగా సీబీఐ కార్యాలయానికి వెళ్లి విచారణ కోరిన వియాన్ని గుర్తు చేశారు. తన రాజకీయ ఎదుగుదలను చూసి ఓర్వలేక ఉద్దేశ పూర్వకంగానే విమర్శలు చేస్తున్నారన్నారు.

అభివృద్ధి గురించి ఏనాడూ పట్టించుకోలేదు

ఏళ్ల తరబడి నియోజకవర్గాన్ని పరిపాలించిన గత పాలకులు అభివృద్ధి గురించి ఏమాత్రం పట్టించుకోలేదని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. వారు చేసి ఉంటే తాను ఇప్పుడు చేయాల్సిన అవసరం ఉండేది కాదన్నారు. ఇన్నేళ్లుగా ఆర్టీసీ బస్టాండ్, పెన్నానదిపై బ్రిడ్జి నిర్మాణం, మార్కెట్ నిర్మాణం, వైఎస్సార్ ఇంజనీరింగ్‌కాలేజి అభివృద్ధి, కాలువల ఆధునీకరణ చేపట్టలేదన్నారు. రూ.120 కోట్లతో నిర్మించిన తాగునీటి పథకాన్ని ఈనెల 21న ప్రారంభించి ప్రజలకు రోజూ తాగునీరు అందిస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కామిసెట్టి బాబు, వార్డు కౌన్సిలర్ నూకా నాగేంద్రారెడ్డి, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ నరసింహ సింగ్, ఈఓ డీవీ రమణారెడ్డి పాల్గొన్నారు.

రైతుల కోసమే వివాదస్పదమైన భూమి కొనుగోలు

ప్రొద్దుటూరు : కేవలం రైతులను ఆదుకోవాలనే ఆలోచనతోనే ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి వివాదస్పదమైన భూములను, గోడౌన్‌ను తన ద్వారా అమ్మించాడని ఉద్యానశాఖ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సంబటూరు ప్రసాద్ రెడ్డి తెలిపారు. స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాజుపాళెం మండలం చిన్నశెట్టిపల్లె గ్రామం పరిధిలోని విజయదుర్గ రూరల్ వేర్ హౌస్ గోడౌన్ బాధిత రైతులకు సోమవారం రూ.1.31 కోట్లు చెల్లించారు. ఈ సందర్భంగా సంబటూరు ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రాజుపాళెం మండలం చిన్నశెట్టిపల్లె రైతులు పండించుకున్న శనగలను గోడౌన్‌లో నిల్వ చేయడం, గోడౌన్ యజమాని భరత్ కుమార్‌రెడ్డి ఆత్మ చేసుకోవడం జరిగిందన్నారు. తమకు డబ్బు చెల్లించాలని రైతులు జిల్లాలో అనేక మంది ప్రజా ప్రతినిధులను, అధికారులను సంప్రదించారన్నారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ద్వారానే సమస్య పరిష్కారమవుతుందని భావించి రైతులు ఆయనను ఆశ్రయించారన్నారు. సమస్య తీవ్రత తెలిసినా, కుటుంబ సభ్యులు, సన్నిహితులు గోడౌన్‌ను కొనుగోలు చేయించొద్దని, సలహా ఇచ్చినా కేవలం రైతుల కోసం ముందుకు వచ్చారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, రాయలసీమ పోలీసు కంప్లైంట్ అథారిటీ మెంబర్ కాకర్ల నాగేషారెడ్డి, తొగటవీరక్షత్రియ సంఘం జిల్లా అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ పాల్గొన్నారు.


రైతుల నుంచి బాండు తీసుకుని డబ్బు ఇస్తున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రొద్దుటూరు : ప్రజలకు ఉచిత సేవలు అందిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని 3, 4, 5 వార్డుల పరిధిలో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలను అందించేందుకు ప్రభుత్వం దశల వారిగా ఏదో ఒక రకమైన కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న ప్రజలకు ప్రభుత్వం ఉచితంగానే రేషన్ కార్డులో మార్పులు చేర్పులు, కొత్త రేషన్ కార్డు మంజూరుతోపాటు అనేక రకాల సర్టిఫికెట్లను ఇస్తోందన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక నియోజకవర్గానికి దాదాపు రూ.2వేల కోట్లు సంక్షేమ పథకాల ద్వారా ప్రజల ఖాతాల్లో జమ అయిందన్నారు. 24వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చామని తెలిపారు. రూ.93 కోట్లతో మున్సిపాలిటీలో రోడ్లు, కాలువలను నిర్మించామని అన్నారు. ప్రజల సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కరిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి, మూడో వార్డు ఇన్‌చార్జి కృష్ణార్జునరెడ్డి, 5వ వార్డు ఇన్‌చార్జి కామిశెట్టి తేజ, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కామిశెట్టి బాబు, పట్టణ సచివాలయ కన్వీనర్ కాకర్ల నాగేషారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, డీఈ దస్తగిరి, ఏసీపీ మునిరత్నం, డిప్యూటీ తహసీల్దార్లు సుదర్శన్, సతీష్ పాల్గొన్నారు.


ప్రొద్దుటూరు : సర్టిఫికెట్ అందిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి

పోరుమామిళ్ల : దేశంలోనే వినూత్న పథకాలు అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం మనదేనని, పథకాలు అందరికీ అందించాలనే ఆశయంతో జగనన్న సురక్ష పథకం తీసుకొచ్చినట్టు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని 1వ సచివాలయ పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష సభలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ఏవైనా అందని వారికి అందించేందుకు నెల రోజుల పాటు సర్వే నిర్వహించి, దరఖాస్తులు తీసుకొని వారికి సర్టిఫికెట్లు ఇచ్చి పథకాలు అందించడం ఈ పథకం ఉద్దేశమన్నారు. జగనన్న పథకాల అమల్లో పార్టీలు, కులాలు, రెకమెండేషన్, దళారుల ప్రమేయం ఉండదన్నారు. సభలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి మాట్లాడుతూ ప్రజల కోసం, రాష్ట్రాభివృద్ధి కోసం పని చేస్తున్న జగనన్నపై ప్రతిపక్షపార్టీలు అనవసర విమర్శలు చేస్తున్నాయన్నారు. అనంతరం ధృవీకరణ పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, మండల ఉపాధ్యక్షుడు సీఎం బాషా, కో–ఆప్షన్ మెంబర్ అల్లాహ్, ఉపసర్పంచ్ రాళ్లపల్లె రవికుమార్, ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్, అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు వరం జగనన్న సురక్ష

అట్లూరు : మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న జగనన్న సురక్ష పథకం ప్రజలకు వరం లాంటిదని మండల కన్వీనరు ముడమాల ప్రభాకర్ రెడ్డి, జిల్లా పశుగణాభివృద్ధి సంఘం చైర్మన్ రొండా మాధవరెడ్డి, మండల సచివాలయాల కన్వీనరు మణ్యం మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన అట్లూరు సచివాలయ ఆవరణంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అట్లూరు సచివాలయ పరిధిలోని 11 రకాలకు సంబంధించి అవసరమైన వారికి 205 పత్రాలను అక్కడే అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి అందూరు రామకృష్ణారెడ్డి, కుంబగిరి ఎంపీటీసీ సభ్యుడు గంగయ్య, అట్లూరు, వరికుంట సర్పంచులు యల్లమ్మ, రమణ, మండల నాయకులు రెడ్డెయ్య, పెంచల్‌రెడ్డి, తహసీల్దారు శ్రీవాణి, ఎంపీడీఓ సుజాతమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజరు విజయకుమారి, ఎంఈఓ విలియంరాజు, ఐకేపీ ఏపీఎం సురేష్, రామకృష్ణయ్య పాల్గొన్నారు.


పోరుమామిళ్ల : సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

బద్వేలు అర్బన్ : అర్హత ఉండి ప్రభుత్వ పథకం అందని వారికి సైతం లబ్ధి చేకూర్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టాడని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని కుమ్మరికొట్టాలు సచివాలయం ఆవరణలో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కులం, మతం, పార్టీ చూడకుండా అర్హతే ప్రామాణికంగా 98 శాతం మందికి సంక్షేమ పథకాలు అందజేశామన్నారు. అనంతరం లబ్ధిదారులకు ధృవీకరణ పత్రాలు అందజేశారు. వార్డు కౌన్సిలర్ శీలి రమాదేవి, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జిలు చెన్నకృష్ణారెడ్డి, చెన్నయ్య, ఓబులేసు, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ప్రజలకు ఎంతో లబ్ధి

కలసపాడు : జగనన్న సురక్షతో ప్రజలకు ఎంతో లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఎగువ తంబళ్లపల్లె గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు పాల్గొని మాట్లాడారు. ఎగువ తంబళ్లపల్లె సచివాలయం పరిధిలో 102 మంది దరఖాస్తు చేసుకోగా 90 మందికి అప్పటికప్పుడే సర్టిఫికెట్లను అందజేశారు. మిగిలిన 12 సర్టిఫికెట్లను రెండు రోజుల్లో అందజేస్తామని అధికారులు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలకు తెలియజేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

మైదుకూరు : రాష్ట్రంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని 9వ సచివాలయంలో నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలకు అర్హత ఉన్నా అందుకోలేని వారి కోసం జగనన్న సురక్షలో అవసరమైన సర్టిఫికెట్లను అందించి పథకాలను లబ్ధిపొందే విధంగా సీఎం చర్యలు చేపట్టారన్నారు.

138 మందికి సర్టిఫికెట్లు పంపిణీ

మైదుకూరులోని 9వ సచివాలయం పరిధిలో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరంలో 138 మందికి సర్టిఫికెట్లు అందించారు. శిబిరానికి 149 మంది సర్టిఫికెట్ల కోసం రాగా అందులో 138 మందికి ఆదాయ, కుల, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌లో మొబైల్ నంబర్ చేర్పు వంటి సేవలు అందించారు. మరో 11 మందికి త్వరలోనే సర్టిఫికెట్లను అందిస్తామని మున్సిపల్ కమిషనర్ వై.రంగస్వామి తెలిపారు. ఈ శిబిరంలో మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, తహసీల్దార్ అనురాధ, డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అందరికీ మేలు

బ్రహ్మంగారిమఠం: జగనన్న సురక్ష పథకంతో అర్హులందరికీ మేలని ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని రేకలకుంట 1 గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎంపీడీఓ వెంగమునిరెడ్డి మాట్లాడుతూ రేకలకుంట 1 సచివాలయం పరిధిలో 90 మందికి సర్టిఫికెట్లు ఇస్తున్నామన్నారు. మండల ఉపాధ్యక్షురాలు సుహాసిని భర్త మండల గ్రామ సచివాలయాల కన్వీనర్ కూన పులి రాజానాయుడు, సర్పంచ్ జ్యోత్స్న భర్త సురేష్, గ్రామ సచివాలయ కార్యదర్శి సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలన దేశానికే ఆదర్శం

బి.కోడూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ప్రభలవీడు, తిప్పరాజుపల్లె, నరసయ్యకొట్టాలు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. తొలుత ప్రభలవీడులో వాటర్‌షెడ్ పథకం కింద మంజూరైన పట్టలు, స్ప్రేయర్లు, వ్యవసాయ పనిముట్లతో పాటు నీటి పైపులను రైతులకు అందజేశారు.

కరెంటు బిల్లులను తగ్గించాలని డిమాండ్

ప్రొద్దుటూరు : ప్రజలకు భారంగా మారిన కరెంటు బిల్లులను తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఇటీవల పెరిగిన కరెంటు బిల్లులు ప్రజలకు భారంగా మారాయని, బిల్లులు తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.